కీసరలో స్పోర్ట్స్‌ స్కూల్‌ ఏర్పాటు చేయాలి

కీసర: ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్‌ స్కూల్‌ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని కీసర మండలంలో స్పోర్ట్స్‌ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర నేత సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. శశనివారం ఆయన కీసరలో మాట్లాడుతూ... మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ పరిధిలో తెలంగాణలోనే ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట దేవాలయం ఉందన్నారు. ప్రభుత్వం స్పోర్ట్స్‌ స్కూల్‌ను కీసర మండలంలో ఏర్పాటు చేస్తే ఎంతో గుర్తింపు లభిస్తుందన్నారు. గతంలో ఇక్కడి నుంచి ఎంపీగా గెలుపొందిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కీసరగుట్ట పరిసర ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

డ్రైనేజీ పైప్‌లైన్‌ పనుల ప్రారంభం



డ్రైనేజీ పనులు పర్యవేక్షిస్తున్న చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య

ఘట్‌కేసర్‌: పురపాలక సంఘం పరిధిలోని 11వ వార్డు సూర్యానగర్‌ ఎన్‌క్లేవ్‌లో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్‌ నిర్మాణ పనులను మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాలనీలో అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ లేక ప్రజల ఎదుర్కొంటున్న ఇబ్బందిని పరిష్కరించడానికి నిర్మాణం చేపట్టామన్నారు. డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. స్థానిక కౌన్సిలర్‌ మల్లేశ్‌, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం

- సూక్ష్మ, చిన్నతరహా, కుటీర పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి
- 20 మహిళా శక్తి క్యాంటీన్లకు ప్రతిపాదనలు సిద్ధం
- కలెక్టరేట్‌తో పాటు 3 కేంద్రాల్లో కొనసాగుతున్న పనులు
- మున్సిపల్‌ సర్కిళ్లు, 13 పురపాలక సంఘాల్లో 17 క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు
- రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు రుణం



సాక్షి, సిటీబ్యూరో: మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యంగా మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆయా సంఘాలకు భరోసా కల్పించేందుకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల నిర్వహణ బాధ్యతలను అప్పగించటం ద్వారా ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే మహిళా శక్తి పథకం కింద క్యాంటీన్ల నిర్వహణతో పాటు మీ–సేవ కేంద్రాలు, ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్లు, ప్లాస్టిక్‌ వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌ యూనిట్లు, కస్టం హైరింగ్‌, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, పౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ ఔట్‌ లెట్లు, మిల్క్‌ పార్లర్స్‌ ఏర్పాటుపై పురపాలక సంఘాలు, మున్సిపల్‌ సర్కిళ్లు, మండలాల వారీగా ప్రణాళికలు రూపొందించి కార్యాచరణపై దృష్టి సారిస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు తీసుకుని చిన్నపాటి వ్యాపారాలు కొనసాగిస్తున్న స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాలకు రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది.

◆ మేడ్చల్‌–మల్కాజిగిరి జిలాల్లో మహిళా శక్తి పథకం ఆధ్వర్యంలో 20 మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), మెప్మా ఆ దిశగా కసరత్తు చేస్తున్నాయి. డీఆర్‌డీఏ అధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్ర సచివాలయంలో ఒక మహిళా శక్తి క్యాంటీన్‌ ఏర్పాటు చేయగా, మేడ్చల్‌ కలెక్టరేట్‌సహా మేడ్చల్‌, శామీర్‌పేట మండలాల్లో మూడు మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు నిర్మాణ పనులు చేపడుతోంది. ఈ మూడు క్యాంటీన్లు కూడా వచ్చే నెల మొదటి వారం కల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. అలాగే కీసర, ఘట్‌కేసర్‌ మండలాల పరిధిలో మరో రెండు మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది.

అర్హతను బట్టి రుణ సదుపాయం

మహిళా సంఘాల అర్హతను బట్టి రూ. 50 వేల నుంచి రూ. 20 లక్షల వరకు ఏటా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తే మళ్లీ ఇస్తారు. దీంతో పాటు ప్రభుత్వపరంగా క్యాంటీన్లు ఏర్పాటు చేసి వీటిని మహిళా సంఘాల సభ్యులకు కేటాయించాలని సర్కారు ఇటీవలే నిర్ణయం తీసుకుంది.

మెప్మా ఆధ్వర్యంలో...

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్‌ సర్కిళ్లతోసహా 13 పురపాలక సంఘాలతో కలిపి మొత్తంగా 15 మహిళా క్యాంటీన్ల ఏర్పాటునకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

◆ బోడుప్పల్‌, జవహర్‌ నగర్‌, పీర్జాదిగూడ, నిజాంపేట, మేడ్చల్‌, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్‌, దుండిగల్‌, కొంపల్లి పురపాలక సంఘాల్లో మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలోని జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్‌ సర్కిళ్లలో కూడా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

10,750 సంఘాల్లో 1.09 లక్షల మంది సభ్యులు

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని రూరల్‌ ప్రాంతంలో 13 పురపాలక సంఘాలు ఉన్నాయి. ఐదు మండలాల పరిధిలో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని డీఆర్‌డీఏ, మెప్మా అధ్వర్యంలో 10,750 స్వయం సహాయక మహిళా సంఘాలు పని చేస్తున్నాయి. ఇందులో 1,09,361 మంది సభ్యులు ఉన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఐదు మండలాలకు సంబంధించి ఒక జిల్లా సమాఖ్య, ఐదు మండల సమాఖ్యలు, 3,395 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 36,911 మంది సభ్యులు ఉన్నారు. మెప్మా ఆధ్వర్యంలో 13 పురపాలక సంఘాల పరిధిలో 13 టౌన్‌ లెవల్‌ మహిళా సమాఖ్యలు, 208 ఏరియా లెవల్‌ మహిళా సమాఖ్యలు, 7,245 మహిళా సంఘాలు పని చేస్తున్నాయి. ఆయా సంఘాల్లో 72,450 మంది సభ్యులు ఉన్నారు.

పక్కాగా క్యాంటీన్ల నిర్వహణ

నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేందుకు కార్యాచరణ తయారు చేయాలని కలెక్టర్‌ ఆదేశించారు. దీంతో సంబంధిత అధికారులు మున్సిపల్‌ సర్కిళ్లు, పురపాలక సంఘాలు, మండలాల వారీగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే మహిళా సంఘాల సభ్యులతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టించారు.

స్థలాల కోసం అన్వేషణ

మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు అనువైన స్థలాలు ఎంపిక చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉండే కలెక్టరేట్‌తో పాటు ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయని మెప్మా అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఆదిశగా క్యాంటీన్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం



ఘట్‌కేసర్‌లో మట్టి వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న విద్యార్థినులు

ఘట్‌కేసర్‌: మన వీధిలో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజ చేద్దామని, అందుకు మనం స్వయంగా మట్టి విగ్రహాలను తయారు చేసుకోవాలని సీనియర్‌ సోషల్‌ సైంటిస్ట్‌ డాక్టర్‌ ప్రసన్నకుమార్‌ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం మట్టి విగ్రహాలు, తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పూజలో వినియోగించే పువ్వులు, మూలికలను కంపోస్ట్‌ చేయాలని, మట్టిలో కలవని పదార్థాలను స్వచ్ఛమైన నీటి వనరులలో కలుపొద్దని సూచించారు. రానున్న వినాయక చవిత పండుగకు 2 వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తామన్నారు.

బీజేపీలోనే కార్యకర్తలకు గుర్తింపు



అర్జున్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌: కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ బీజేపీలో అధిష్టానం గుర్తింపునిచ్చి ఉన్నత పదవుల్లో నిలబెడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. మండలంలోని గిర్మాపూర్‌కు చెందిన అర్జున్‌ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులు కావడంతో మండల నాయకులతో కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీలో పార్టీ కోసం నిరంతరం పని చేసే నాయకులను గ్రామ స్థాయి నుండి దేశ స్థాయి వరకు ఎదిగేలా చేసిందని అన్నారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్‌ మోహన్‌రెడ్డి, రాష్ట్ర బీజేవైఎం ప్రధాన కార్యదర్శి పవన్‌రెడ్డి, నాయకులు తిరుమల్‌రెడ్డి, బుద్ధి శ్రీనివాస్‌, జగన్‌గౌడ్‌, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, ప్రేందాస్‌, శ్రీశైలం యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటిని చెరువులో కలపొద్దు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ చౌరస్తాలోని మైల్‌స్టోన్‌ కమర్షియల్‌ కాంప్లెక్స్‌ నుంచి వెలువడే మురుగు నీటిని గ్రామ చెరువులో కలపడం సరికాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో మురుగునీటిని కలుపడంతో నీరు కాలుష్యం అవుతుందని అడ్డుకోవల్సిన ప్రజాప్రతినిధులే పనులు చేయించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు మంచి చేయాల్సిన ప్రజాప్రతినిధులు తమ స్వలాభం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం అడ్డుతున్నారని వారిపై అధికారులు చర్యలు తీసుకోని పనులు ఆపాలని గ్రామ ముదిరాజ్‌ సంఘం నాయకులు, గ్రామస్తులు కోరారు.

పాఠశాలల్లో సందడిగా కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకలలో సెయింట్‌ ప్యాట్రిక్స్‌ చిన్నారులు



రాంపల్లిలోని జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ రాంపల్లిలో విద్యార్థులు

మేడ్చల్‌: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వివిధ ప్రైవేటు పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులను వారి తల్లితండ్రులు గోపికలు, శ్రీకృష్ణుడిగా అందంగా తయారు చేసి పాఠశాలలకు పంపడంతో పాఠశాలలో సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పిల్లలతో మమేకమై పండగను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సెయింట్‌ ప్యాట్రిక్స్‌ పాఠశాలలో వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలల్లో పాఠశాల చైర్మన్‌ సుబ్బరామయ్యరెడ్డి, కరస్పాండెంట్‌ స్వామిదాస్‌, ప్రిన్సిపాల్‌ రాజలింగం యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

రాంపల్లి జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో...

కీసర: రాంపల్లిలోని జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణల్లో అలరించారు. మన సంస్కృతి సంప్రదాయాలతోపాటు మన పండగల విశిష్టతలను విద్యార్థులకు తెలియజేయాలనే సదుద్దేశంతోనే శ్రీ కృష్ణాష్టమి వేడులను నిర్వహించామని ప్రిన్సిపాల్‌ బి.పద్మజరావ్‌ పేర్కొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప మూలవిరాట్‌

మేడ్చల్‌: పట్టణంలోని అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గురుస్వాములు రాజేశ్వర గురుస్వామి, కృష్ణమూర్తి గురుస్వామిల నేతృత్వంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాభిషేకం, అర్చన, నివేదన, అలంకరణ, హారతి, మంత్ర పుష్పం, భూతనాథ స్తుతి, పడిపూజ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయాన్ని పూలు, విద్యుత్‌ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పూజల్లో గురుస్వాములు నర్సింహ స్వామి, అనిల్‌, ప్రశాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లా నీటిని ఉచితంగా సరఫరా చేయాలి



జలమండలి ఏఈ సతీస్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కీసర: జవహర్‌నగర్‌ చెత్త డంపింగ్‌ వల్ల దమ్మాయిగూడ మున్సిపల్‌ పరిధిలోని ప్రగతినగర్‌, ఖుషీ గార్డెన్‌, శివానందపురి, వెస్ట్‌ గాంధీనగర్‌ తదితర కాలనీల్లో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమైనందున జలమండలి అధికారులు ఉచితంగా తాగునీటిని సరఫరా చేయాలని కాలనీవాసులు శనివారం జలమండలి ఏఈ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం ఆయా కాలనీల ప్రజలు నిర్వహించిన సమావేశానికి జలమండలి ఏఈ సతీష్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... తమ కాలనీల్లో ఉన్న నల్లా కనెక్షన్లకు వచ్చిన నీటి బిల్లులను సైతం మాఫీ చేయాలని కోరారు. సమస్యను జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

ఘనంగా స్పేస్‌ డే వారోత్సవం



విద్యార్థులకు బహుమతులు బ అందజేస్తున్న సైంటిస్ట్‌, ప్రిన్సిపాల్‌

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలో నేషనల్‌ స్పేస్‌ డే వారోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసీఈ ఆధ్వర్యంలో చేపట్టిన సదస్సులో సైంటిస్ట్‌ ప్రవీణ్‌కుమార్‌ మాట్లాడుతూ... దేశం మిస్సైల్‌ రంగంలో సాధించిన ప్రగతిని వివరించారు. చంద్రయాన్‌–3 విజయంతో అంతరిక్ష రంగంలో దేశాన్ని సగర్వంగా నిలబెట్టిన సైంటిస్టులు, ఇంజినీర్లను అభినందిస్తూ నేషనల్‌ స్పేస్‌ డే జరుపుకోవడం సంతోషకరం అని కళాశాల ప్రిన్సిపాల్‌ అశోక్‌ అన్నారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్‌, పేపర్‌ ప్రెజంటేషన్‌, సెమినార్‌ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఓడీ సంపత్‌కుమార్‌, కన్వీనర్‌ వంశీ, శివకుమార్‌, పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌ సీటు ఇప్పిస్తానని మోసం చేసిన వారిపై కేసు

ఘట్‌కేసర్‌: ఇంజినీరింగ్‌ కళాశాలలో సీటు ఇప్పిస్తానని మోసం చేసిన వారిపై ఘట్‌కేసర్‌ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. బాధితులు, పోలీసుల సమాచారం మేరకు... సికింద్రాబాద్‌ రెజిమెంటల్‌ బజార్‌కు చెందిన జక్కుల కృష్ణవేణి కుమారుడు అభినవ్‌కు ఘట్‌కేసర్‌ మండలం అవుషాపూర్‌లోని ఓ ఇంజినీరింగ్‌ కళాశాలలో సీటు ఇప్పిస్తానని లాలాపేట్‌కు చెందిన జితేందర్‌చారి, సికింద్రాబాద్‌కు కార్ఖానాకు చెందిన లెనిన్‌గౌడ్‌ తెలిపారు. అందుకు రూ. 3 లక్షల 30 వేలు అవుతాయని చెప్పడంతో అభినవ్‌ తల్లి ఈ నెల 10న వారికి డబ్బులు చెల్లించింది. సీటు ఇప్పించాలని రెండు వారాలుగా ఫోన్‌ చేస్తే వారు స్పందించడం లేదు. దీంతో బాధితులు ఘట్‌కేసర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్‌: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 12వ డివిజన్‌ కార్పొరేటర్‌ బొమ్మక్‌ కళ్యాణ్‌కుమార్‌ అన్నారు. గౌతమీనగర్‌ కాలనీలో రూ. 10లక్షలతో శనివారం సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలో సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గౌతమీనగర్‌ కాలనీ అధ్యక్షులు దుర్గయ్య, కాలనీవాసులు ముత్యాలు, సారయ్య, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ అభినందనీయం

- తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం–2024 ముసాయిదాపై అభిప్రాయ సేకరణ
- పాల్గొన్న కలెక్టర్‌, రిటైర్డ్‌ అధికారులు, ప్రొఫెసర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు



సాక్షి,సిటీబ్యూరో: ధరణి సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం–2024 రూపకల్పనపై అభిప్రాయ సేకరణకు ప్రభుత్వం చర్చావేదిక కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో హర్షణీయమని పలువురు అభిప్రాయపడ్డారు. శనివారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం 2024 ముసాయిదాపై చర్చా కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్‌ గౌతమ్‌ ప్రారంభించారు. 1971లో ఆర్‌ఓఆర్‌ చట్టం వచ్చిందని, 1989 నుంచి ఇదే చట్ట ప్రకారం పట్టాదారు పాసు పుస్తకాల ద్వారా భూ పంపిణీ చేయడం జరిగిందని కలెక్టర్‌ పేర్కొన్నారు. 2020 వరకు ఈ చట్టం ప్రకారమే రెవెన్యూ శాఖ వ్యవహరించిందన్నారు. అక్టోబర్‌ 2020 నుంచి ధరణి పోర్టల్‌ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌డేషన్‌ చేయడమైందన్నారు. ధరణిలో రిజిస్ట్రేషన్‌ అయిన వెంటనే జాప్యం లేకుండా పాసుపుస్తకం అందించేవారని, కానీ కొన్ని సమస్యలు ఎదుర్కొనట్లు వివరించారు. అభిప్రాయ సేకరణలో రిటైర్డ్‌ రెవెన్యూ అధికారులు, నల్సార్‌ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొనడంక ఆనందంగా ఉందన్నారు. బిల్లులోని అంశాలపై సలహాలు, సూచనలు అందించాలని కోరారు. అలాగే అభిప్రాయాలను రాతపూర్వకంగా కూడా అందించాలని కలెక్టర్‌ సూచించారు. చర్చావేదికలో సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ చర్చా వేదికలో డీఆర్‌ఓ హరిప్రియ, అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ రామ్మోహన్‌, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, రాజేష్‌కుమార్‌, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, కాంగ్రెస్‌ నాయకులు హరివర్ధన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.అభిప్రాయ సేకరణలో పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు.



వీఆర్‌ఓ వ్యవస్థ ఉండాలి

గ్రామ స్థాయిలో వీఆర్‌ఓ వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలి. గ్రామాల్లో జరిగే చిన్న చిన్న భూ సమస్యలను వీఆర్‌ఓలు తహసీల్దార్‌ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తారు. మ్యూటేషన్‌ తప్పనిసరిగా చేయాలి.

– రవీంద్రబాబు, రిటైర్డ్‌ డిప్యూటీ కలెక్టర్‌

గ్రామ సభలు నిర్వహించాలి

గ్రామస్థాయిలో గ్రామ సభలు నిర్వహించాలి. చిన్న చిన్న సమస్యలను తహసీల్దారు స్థాయిలోనే పరిష్కరించాలి. మ్యూటేషన్‌ తప్పకుండా చేసిన అనంతరం పాస్‌ పుస్తకాలను అందజేయాలి. 1971లోని భూ సంస్కరణ చట్టాలను బేస్‌ చేసుకొని ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలుగకుండా నూతన చట్టాలను రూపొందింలి.

– సురేష్‌ పొద్దార్‌, వికారాబాద్‌ రిటైర్డ్‌ జాయింట్‌ కలెక్టర్‌

తప్పులను సవరించి చట్టాలను రూపొందించాలి

భూ సంస్కరణలలో పట్వారీ సిస్టం చాలా పాతది. చాలా కచ్చితమైనది. ఈ పద్ధతిలో చిన్న చిన్న పొరపాట్లు తప్ప.. ఇబ్బందులు ఎక్కువగా ఉండేవి కాదు. నూతన చట్టాలను రూపొందించేటప్పుడు గతంలో జరిగిన తప్పులను సవరిస్తూ సర్వే డిపార్ట్‌మెంటు వాళ్ల సహకారం తీసుకోవాలి. రికార్డులను తప్పులు లేకుండా సవరించి వాటి ద్వారా కొత్త చట్టాలను రూపొందించాలి. రెవెన్యూ ట్రిబ్యూనల్స్‌ ఏర్పాటు చేయాలి.

– ప్రొఫెసర్‌ డా.జి. మల్లికార్జున్‌, నల్సార్‌ యూనివర్సిటీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌

రూపకల్పనలో స్పష్టమైన ఆదేశాలు పొందుపర్చాలి

చట్టాలను రూపొందించేప్పుడు స్పష్టమైన ఆదేశాలను పొందుపర్చాలి. చట్టం తయారు చేసే వారికి, చట్టం అమలు చేసేవారికి గ్యాప్‌ రాకుండా ఉండాలి. ఎవరి కోసం చట్టాలు రూపొందిస్తున్నామో వారికి ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలి. భూ తగాదాలు కోర్టులలో పరిష్కారానికి చాలా కాలం పడుతుంది. భూ సంస్కరణలకు సంబంధించి ట్రిబ్యునల్‌ ఏర్పాటు చేయాలి. అందులో జడ్జి, రెవెన్యూ ఉన్నతాధికారులను కమిటీలుగా ఏర్పాటు చేయాలి. గ్రామ స్థాయిలో ఉచితంగా సలహాలు, సూచనలు అందించేందు కస్టమర్‌ కేర్‌ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలి.

– అశ్విన్‌కుమార్‌, నల్సార్‌ యూనివర్సిటీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌

నాగారంలో హోటళ్ల తనిఖీ



హోటళ్లను తనిఖీ చేస్తున్న కమిషనర్‌ రాజేంద్రకుమార్‌

కీసర: ప్రజలకు నాణ్యత లేని ఆహారాన్ని విక్రయించే హోటళ్లపై చట్టరీత్యా చర్యలు తప్పవని నాగారం మున్సిపల్‌ కమిషనర్‌ రాజేంద్రకుమార్‌ హెచ్చరించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వివిధ హోటళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ... మున్సిపల్‌ పరిధిలోని హోటళ్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహారాన్ని వినియోగదారులకు అందజేయాలన్నారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని విజయ దుర్గా రెస్టారెంట్‌, అరేబియన్‌ మండీ, ఓహో హైదరాబాదీ హోటల్‌, హవిన హోటల్‌, రెడ్‌బకెట్‌ బిర్యానీ, గోదావరి రెస్టారెంట్‌ తదితర 6 హోటళ్ల యజమానుల నుంచి రూ. 95 వేల జరిమానా వసూలు చేశామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తా..



కుషాయిగూడ : సోనియాగాంధీనగర్‌ కాలనీ అభివృద్ధికి తన తోడ్పాటును అందిస్తానని చర్లపల్లి కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి అన్నారు. శనివారం కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా అభినందించారు. కాలనీ సమస్యలపై కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. దశలవారీగా అన్ని సమస్యలకు పరిష్కారం లభించేలా చూస్తానన్నారు. ప్రభావతి, వెంకట్‌రావు, రాంచందర్‌, ప్రసాద్‌బాబు, యాకుబ్‌, కృష్ణ, సతీష్‌, ప్రతాప్‌రెడ్డి, వెంకటేష్‌, ఆంజనేయులు, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కాప్రా: గ్రేటర్‌ హైదరాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేటర్‌ కాప్రా సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌గా జగన్‌ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గ్రేటర్‌ పరిధిలో బదిలీల్లో భాగంగా ఖైరతాబాద్‌ డీసీగా విధులు నిర్వహిస్తున్న జగన్‌ను కాప్రా సర్కిల్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకు కాప్రా డీసీగా విధులు నిర్వహించిన ముకుందరెడ్డి అంతర్గత బదిలీల్లో భాగంగా శేరిలింగంపల్లి జోన్‌కు బదిలీ కాగా.. శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలి ఉత్తర్వుల మేరకు శనివారం కాప్రా సర్కిల్‌ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా జగన్‌ బాధ్యతలు చేపట్టారు. సందర్భంగా సర్కిల్‌ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నల్లచెరువును సందర్శించిన జోనల్‌ కమిషనర్‌



ఉప్పల్‌: ఉప్పల్‌ నల్ల చెరువు అభివృద్ధి, పరిరక్షణకు జీహెచ్‌ఎంసీ అధికారుల యంత్రాంగం కదిలింది. శుక్రవారం ఉప్పల్‌ నల్ల చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలిని కోరిన విషయం తెలిసిందే. కమిషనర్‌ అదేశాల మేరకు శనివారం ఎల్‌బీనగర్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌పాటిల్‌, హెచ్‌ఎండీఏ ఈఈ హరికృష్ణ, స్థానిక కార్పొరేటర్‌ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డితో కలసి చెరువును పరిశీలించారు. చెరువు అభివృద్ధికి వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. డీసీ ఆంజనేయులు, ఈఈ నాగేందర్‌, ఈఈ ప్రాజెక్టు రోహిణి, మెట్రోరైల్‌ ప్రాజెక్ట్‌ అధికారి నర్సింగరావు, కాంగ్రెస్‌ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

ఉప్పల్‌: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. రామంతాపూర్‌ శ్రీనగర్‌ కాలనీకి చెందిన పులివర్తి సందీప్‌ (25) వృత్తి ప్లంబర్‌ గత కొద్దిరోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి రామంతాపూర్‌లోని లక్ష్మీనివాస్‌ అపార్టుమెంట్‌ మూడో అంతస్తు పైనుంచి కిందకు దూకాడు. దీంతో తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.